క్లుప్తంగా

పెండింగ్ వేతనాలివ్వండి..



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న రవి

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ హైస్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల డిసెంబర్ 2023 వేతనం మంజూరు చేయించాలని కోరుతూ.. రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాకుల రవి వినతిపత్రం అందజేశారు. వేతనం పెండింగ్‌లో ఉండటం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ప్రైవేట్ కాలేజీల ఉపాధ్యక్షుడిగా కోటేశ్వరరావు



కొత్తగూడెంరూరల్: తెలంగాణ ప్రైవేటు జూనియర్ కళాశాలల సర్వసభ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొత్తగూడెంలోని కృష్ణవేణి – త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ మాచవరపు కోటేశ్వరరావు ఎన్నికయ్యారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంబురాలు



స్వీట్లు తినిపించుకుంటున్న ఉద్యోగులు

ఇల్లెందు: ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతం పీఆర్సీ పెంపును హర్షిస్తూ ఇల్లెందు ఆర్టీసీ డిపో వద్ద ఉద్యోగులు శనివారం రాత్రి సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుకుని వేడుక చేసుకున్నారు. ఉద్యోగుల తరుపున డిపో మేనేజర్ సంజీవరాణి రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మత్స్య సొసైటీ కమిటీ ఎన్నిక



సొసైటీ కార్యవర్గం

ఇల్లెందురూరల్: పోలారం గ్రామపంచాయతీ చేపల సొసైటీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటైన సొసైటీ సభ్యుల సమావేశంలో చైర్మన్‌గా కల్తీ సీతారాములు, వైస్ చైర్మన్‌గా భూక్యా మంగ్యా, కార్యదర్శిగా వాంకుడోత్ హర్‌జ్యా, సభ్యులుగా వాంకుడోత్ రమేష్, వజ్జ రామ్మూర్తి, వట్టం రాంబాబు, ధరావత్ మంగీలాల్, బానోత్ రాజన్, బానోత్ చరణ్, ధరావత్ రవి, ఇప్ప కృష్ణ, నాగేంద్ర బాబులను ఎన్నుకున్నారు.

టిప్పర్ డ్రైవర్ల వేతనాలు పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న డ్రైవర్లు

టేకులపల్లి: కేటీసీ టిప్పర్ల డ్రైవర్ల వేతనాలు పెంచాలని నూతనంగా ఏర్పాటైన టిప్పర్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారావుకు శనివారం టిప్పర్ డ్రైవర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ అనుబంధ బ్రాంచ్ కమిటీ ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మంగీలాల్, వెంకటేష్, గోపి, రామారావు, మోహన్ డ్రైవర్ యూనియన్ నాయకులు నరేష్, మదార్, రవీందర్, చందర్, వెంకన్న పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కొత్తగూడెంఅర్బన్: వార్డులో అభివృద్ధి పనులు వేగవంతంగా నిర్వహించాలని 35వ వార్డు కౌన్సిలర్ రుక్మాంగధర్‌బండారి అన్నారు. శనివారం వార్డులో రూ.50 లక్షలతో నిర్మాణం చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని, గడువు లోపు పూర్తి కావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రజనీకాంత్ బండారి, కాలిపటాన్, సయ్యద్, జాని, బాలకృష్ణ, రమణ, వేణు, కాంట్రాక్టర్ కొండ పాల్గొన్నారు.



ఇల్లెందు: అంబజార్ ఆలయంలో శివపార్వతులు



ఇల్లెందురూరల్: రేపల్లెవాడలో అన్నదానం



టేకులపల్లి: కొండెంగులబోడులో...

శివపార్వతుల కల్యాణం

ఇల్లెందు: మహాశివరాత్రి పండుగ సందర్భంగా జాగారం ఉండే భక్తుల కోసం ఇల్లెందు జేకే సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో భక్తులు జాగారం ఉండేందుకు ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శివపార్వతుల కల్యాణం సందర్భంగా శనివారం మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నదానం ప్రారంభించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మధు, చక్రధర్, సురేష్, శంకర్, భాస్కర్, మహేష్, రాజేంద్రప్రసాద్, సుబ్బారావు, కండె రమేష్, ఆనందరావు, రాజశేఖర్, సతీష్‌కుమార్, అర్వపల్లి రాధాకృష్ణ, వ్యామసాని జనార్దన్, పొద్దుటూరి నాగేశ్వరరావు, మేడ రాకేష్ పాల్గొన్నారు.

రేపల్లెవాడలో అన్నదానం

ఇల్లెందురూరల్: రేపల్లెవాడ గ్రామపంచాయతీలోని శివాలయంలో మహాశివరాత్రి వేడుకల సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేశారు. జాగారం చేసిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

టేకులపల్లి: గంగారం పంచాయతీ సిద్ధారం గుట్ట అడవిలో స్వయంభువుగా వెలిసిన సోమలింగేశ్వర స్వామి ఆలయంలో బోయపల్లి రవికుమారచార్యుల అర్చకత్వంలో శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. చుట్టుపక్కల మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ పెద్దలు కొర్స ఈశ్వరయ్య, దొడ్డ వసంతరావు, దొడ్డ కోటేశ్వరరావు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఆళ్లపల్లి ఎస్ఐ రితీష్, బోడు ఏఎస్ఐ బీల్యా ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మద్రాస్‌తండా పంచాయతీ కొండెంగుల బోడు గుట్టపై నెలకొన్న వీరభద్రస్వామి భద్రకాళీ దేవాలయంలో ఉదయం జాతర, తెల్లవారు జామున శివపార్వతుల కల్యాణ వేడుకలు శ్రీరంగం అజయ్‌సాయి చక్రి, కేశోతు శంకర్ సారథ్యంలో నిర్వహించారు. వేడుకల్లో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, లక్ష్మి దంపతులు పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కొప్పురాయి పంచాయతీ లక్ష్మీపురంలోని వీరభద్ర స్వామి ఆలయంలో వీరభద్ర స్వామి కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.



జూలూరుపాడు: శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

జూలూరుపాడు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి పాపకొల్లు శ్రీఉమాసోమలింగేశ్వర స్వామి ఆలయంలో, గాంధీనగర్ శ్రీహిమచంద్రశేఖర ఆలయంలో, బేతాళపాడు శ్రీసోమేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. సీఐ ఇంద్రసేనారెడ్డి పర్యవేక్షణలో ఏఎస్సై తిరుపతిరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

శివాలయాల్లో అన్నదానాలు

పాల్వంచ: పట్టణంలోని పలు శివాలయాల్లో శివలీలా కల్యాణ మహోత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శనివారం పాత పాల్వంచ ఆత్మలింగేశ్వరాలయం, గట్టాయిగూడెం, ఇందిరా కాలనీ, వనమా కాలనీ, అయ్యప్పగుడి తదితర ఆలయాల్లో అన్నదానాలు నిర్వహించారు.



ఇల్లెందు: కొత్త కాలనీలో స్వామివారి కల్యాణం..



టేకులపల్లి: సిద్ధారంలో భక్తుల సందడి...



ఇల్లెందు: కొత్త కాలనీలో అన్నదానం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి: అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్‌గా కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం ఆయన టేకులపల్లి మండలంలో పర్యటించారు. లచ్చగూడెం పంచాయతీలో రూ.20లక్షలు, కిష్టారంలో రూ.30 లక్షలు, గంగారంలో రూ.10 లక్షలు, చింతోనిచెలకలో రూ.13 లక్షలు, కొప్పురాయిలో రూ.10 లక్షలు, టేకులపల్లిలో రూ.28 లక్షలు, రాంపురంలో రూ.10 లక్షలు, సులానగర్‌లో రూ.30 లక్షలు, గోలియాతండాలో రూ.45లక్షలు, బేతంపూడిలో రూ.1.15 కోట్లు మొత్తం ఈజీఎస్, డీఎంఎఫ్ నిధులు రూ.3.11 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. చింతోనిచెలక గ్రామంలో నూతంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు పూనెం సురేందర్, మండల అధ్యక్షుడు భూక్యా దేవా, వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్, ఎంపీటీసీలు బానోతు పూర్ణ, బానోతు సరోజిని, చింత కాంతకుమారి, కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షుడు ఏలూరి కోటేశ్వర్‌రావు, మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు బండ్ల రజిని, సూపరింటెండెంట్ సామల శ్రీనివాస్, ఏఈ నవీన్, డీటీ ముత్తయ్య, ఎస్ఐ సైదా రవూఫ్, వీసం నీలమయ్య, సొసైటీ డైరెక్టర్లు ఉదయ్, కృష్ణయ్య, ఏఓ అన్నపూర్ణ, కార్యదర్శులు లంకపల్లి కిరణ్, దొడ్డ మీనాకుమారి, మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

12న పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు అందజేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. శనివారం లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలను కౌన్సిల్ సభ్యులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. మాట్లాడుతూ... లబ్ధిదారులకు ప్లాట్లను సిద్ధం చేశామని, నంబర్ల కేటాయింపు పూర్తయిందన్నారు. 12వ తేదీన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయనున్నట్లు ప్రకటించారు. ప్లాట్లు పొందిన లబ్ధిదారులు ఆరు నెలల లోపు ఇంటి నిర్మాణం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మహ్మద్ సాహెరాబేగం, గుమ్మడెల్లి కల్యాణి, కేశంశెట్టి సుజాత, వేముల ప్రసాద్‌బాబు, కొడగాని పరమేష్, బోయిన విజయ్‌కుమార్, పోలోజు సత్యనారాయణచారి, కోలాపురి ధర్మరాజు, యరమల శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ డి.పుల్లయ్య, మున్సిపల్ మేనేజర్ లోగాని సత్యనారాయణ, డీఈ రవికుమార్ పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరిపించండి..



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను శనివారం హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్‌నాయక్ ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. రాజేష్‌నాయక్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో వర్క్ ఆర్డర్లు, డిప్యూటేషన్లు రద్దు అయినప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. జిల్లాలో ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారిగా ఖమ్మం జిల్లా నుంచి వర్క్ ఆర్డర్‌పై వచ్చిన ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓగా, భద్రాచలం అడిషనల్ డీఎంహెచ్‌ఓగా ట్రైబల్ శాఖలో అర్హత లేనప్పటికీ ఉద్యోగంలో కొనసాగించడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఎస్‌సీపీ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల పెయింటింగ్ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని కోరారు. అదేవిధంగా ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల నియామకాల్లో అక్రమాలు జరిగాయని విచారణ చేపట్టాలని, గత హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు కనుసన్నల్లోనే ప్రస్తుత హెల్త్ డైరెక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించారని చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక అయ్యప్పనగర్‌లో పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ... 11వ తేదీన భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయంలో స్వామి దర్శనం, అనంతరం మిథిలా స్టేడియంలో అధికారులతో సమీక్ష, ఇందిరమ్మ గృహ పథకం ప్రారంభం, మధ్యాహ్నం 3గంటలకు మణుగూరు బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే పాల్గొంటారని, కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జాలే జానకిరెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, కొండెం వెంకన్న, నూకల రంగారావు, బద్ది కిశోర్, భట్టు మురళి, బాలినేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేటినుంచి సామాజిక తనిఖీ గ్రామసభలు

పాల్వంచరూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2022–2023 సంవత్సరానికి సంబంధించిన 15వ విడత సామాజిక తనిఖీ గ్రామసభలు ఆదివారం నుంచి 17వ తేదీ వరకు మండలంలోని 36 గ్రామపంచాయతీల్లో నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు చంద్రాలగూడెంలో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

అథ్లెటిక్ కోచ్‌కు సన్మానం

ఇల్లెందు: 15వ వార్డు మాజీ కౌన్సిలర్ సుదర్శన్ కోరీ కుమార్తె సునందను మహాశివరాత్రి, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ డీవీలు ఘనంగా సత్కరించారు. ఆమె ఇటీవల అంతర్జాతీయ అథ్లెటిక్ కోచ్ లెవల్ –2లో ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా సన్మానించారు.

సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని ఎస్‌సీడబ్ల్యూఏ ఉద్యోగుల క్వార్టర్లకు శనివారం ఏరియా ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. 58 మంది కార్మికులు దరఖాస్తు చేసుకోగా సీనియారిటీ ప్రకారం 28 మందికి అర్హత, కేటగిరిని బట్టి కేటాయించారు. 13 మంది హాజరై క్వార్టర్స్ తీసుకోలేదు. మిగిలిన వారు కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదని, ఏరియా ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా ఆయా ఏరియాలలో ఉన్న క్వార్టర్ల ఖాళీలను బట్టి కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు క్వార్టర్లు కేటాయించడం సంప్రదాయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డితోపాటు ఏజీఎం దుర్గప్రసాద్, ఏజీఎం (సివిల్) రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ శివకేశవరావు, సీనియర్ పీఓలు మురళి, సంఘమిత్ర, ఆఫీస్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంక్రిమెంట్‌పై ఆడిట్...

కొత్తగూడెం ఏరియాలోని ఎస్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు మార్చిలో రావాల్సిన ఇంక్రిమెంట్ కొరకు శనివారం కార్పొరేట్‌లోని ఆడిట్ డిపార్ట్‌మెంట్ తనిఖీ నిర్వహించారు.

ఏరియాలోని జీఎం కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన తనిఖీలో అర్హతను బట్టి ఆడిట్ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు మాట్లాడుతూ.. ఆడిట్ రిపోర్ట్‌లో ఎలాంటి తప్పిదాలు తలెత్తకుండా చూడాలన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న డీఈఓ వెంకటాచారి

పాల్వంచ: మారుతున్న కాలానికి అనుగుణంగా నేటి విద్యార్థులు భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈఓ వెంకటేశ్వరచారి అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీ విద్య పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనను డీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలను తిలకించి వాటి ప్రాముఖ్యతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ... విద్యార్థులు తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలని, కొత్త ఆలోచనలకు పదును పెట్టాలన్నారు. క్రమశిక్షణతో చదివి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు నేర్పించే అంశాల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. మంచి మార్కులు సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎ.శ్రీరామ్మూర్తి, విద్యాసంస్థల చైర్మన్ వెంకటచౌదరి, సీఈఓ శ్రీ చైతన్య కృష్ణ, ప్రిన్సిపాల్ రమ్య పాల్గొన్నారు.

బీజేపీకి అండగా ఉండండి..

పాల్వంచరూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్రప్రభుత్వం వ్యాపార, వాణిజ్యవర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉందని బీజేపీ నేత వినోదరావు అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో శనివారం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం శాస్త్రీరోడ్డులోని భజన మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. గట్టాయిగూడెంలో నేతలతో సమావేశమైయ్యారు. మాట్లాడుతూ... పారిశ్రామికంగా, వాణిజ్య కేంద్రంగా పాల్వంచ అభివృద్ధిలో వ్యాపారుల పాత్ర అమూల్యమైందన్నారు. దేశం మొత్తం మోదీ గాలీ వీస్తోందని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మోదీకి మద్దతుగా నిలబడి మరోసారి ప్రధానమంత్రిగా ఎన్నుకుంటే అన్నివర్గాలు, ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. పానిశెట్టి వెంకటేశ్వర్లు, మాలోతు ప్రశాంత్‌నాయక్, విజయ్, రవికిరణ్, మాదారపు లక్ష్మణ్, చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీలను రద్దు చేయాలి



స్థానికులతో మాట్లాడుతున్న కామేష్

సుజాతనగర్: సీతంపేట గ్రామంలోని ఎర్రచెరువు, ఊరచెరువు, భాస్కర్ నాయక్ కుంటలలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన చేపల సొసైటీలను వెంటనే రద్దు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానికులతో కలిసి ఎర్ర చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఏ ప్రాంతంలో అయినా చెరువు సొసైటీ ఏర్పాటు చేయాలంటే ముందుగా గ్రామంలో చాటింపు వేసి, గ్రామసభ నిర్వహించి సదరు గ్రామసభలో 1/3 ప్రజలు పాల్గొనేలా చూడాలని, గతంలో చేపలు పడుతున్న వారికి కూడా సమాచారం ఇవ్వాలనే నిబంధన ఉండగా.. గ్రామ కార్యదర్శి అందుకు విరుద్ధంగా ఏకపక్షంగా వ్యవహరించాడని ఆరోపించారు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి ఆయా సొసైటీలను రద్దు చేయడంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తడికమళ్ల దిలీప్, మురిపిటి నాగయ్య, భాగం శేషభూషణం, మంద రాజు, దొడ్డి భూషయ్య, అంకిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

'నారీ శక్తి' పరుగు పందెం పోటీలు



జూలూరుపాడు: విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సెర్ప్ ఏపీఎం సత్యనారాయణరాజు

పాల్వంచరూరల్: మహిళా దినోత్సవం సందర్భంగా బంద్రుగొండ గ్రామంలో శుక్రవారం స్వయం సహాయక గ్రూపు మహిళలకు ఐకేపీ ఆధ్వర్యంలో వివిధ క్రీడాపోటీలు నిర్వహించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో విజేతలకు ఐకేపీ ఏపీఎం రాంబాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వెలుగు సీసీ మురళీ, పంచాయతీ కార్యదర్శి టి.నారాయణ, ఉపాధ్యాయులు భిక్షం, నిమ్మల రాంబాబు, కొలిపాక సంధ్య, పి.శ్రీదేవి, ఏ.నాగమ్మ, నిమ్మల అరుణ, స్వప్న, రాధ, రేణుక, వసంత వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక సెర్ప్ కార్యాలయం పర్యవేక్షణలో ఉషోదయ మండల సమాఖ్య ఆధ్వర్యంలో జూలూరుపాడులో నారీ శక్తి పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు మహిళలు, యువతులు ఉత్సాహం చూపించారు. పోలీసుల సహకారంతో స్థానిక శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు సుమారు 1 కిలోమీటరు పరుగు పందెం పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు జూలూరుపాడు సెర్ప్ ఏపీఎం ఎస్.సత్యనారాయణరాజు, ఏఎస్సై బి.తిరుపతిరావు బహుమతులు అందజేశారు. సెర్ప్ సీసీలు బి.మధుసూదన్‌రావు, డి.నాగేశ్వరరావు, రామారావు, ఉషోదయ మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్రావణి, గ్రామసమాఖ్య, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

సుజాతనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సెర్ప్ ఆధ్వర్యంలో మహిళలకు రన్నింగ్ పోటీలు శనివారం నిర్వహించారు. పోటీలను డీపీఎం(ఎల్‌హెచ్) జి.సునందన్ ప్రారంభించారు. మాట్లాడుతూ... నెహ్రూ యువ కేంద్ర ఖమ్మం వారి ద్వారా 'నారీ శక్తి ఫిట్ నెస్ రన్'అనే కార్యక్రమం కింద ఈ పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం మీరాంబి, సీసీలు శిరీష, భారతి, వీఓఏలు మాధవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని 21పిట్ ఏరియాలో గ్రామీణాభివృద్ధి సంస్థ, నెహ్రూ యువక కేంద్రం సంయుక్తంగా శనివారం నారీ శక్తి ఫిట్‌నెస్ ర్యాలీ నిర్వహించారు. తిలక్‌నగర్ కమ్యూనిటీ హాల్ నుంచి ర్యాలీని ఎంపీటీసీలు పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సెర్ప్ ద్వారా అందిస్తున్న ఆర్థిక చేయూతను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తద్వారా పురుషులకు ధీటుగా అన్నిరంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళలకు పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ధనసరి స్రవంతి, పూనెం కవిత, ఏపీఎం దుర్గారావు, మండల సమాఖ్య ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, కార్యదర్శి సౌజన్య, కోశాధికారి సద్గుణ, సీసీ స్వర్ణలత, గ్రామ సంఘం సహాయకులు వెంకటలక్ష్మి, నవ్య, ప్రమీల, సుల్తానా, బేబీ, రాణి, ఝాన్సీ, రమణ, అరుణ, జయ తదితరులు పాల్గొన్నారు.



సుజాతనగర్: విజేతలతో సెర్ప్ సిబ్బంది



పాల్వంచరూరల్: బహుమతులు అందజేస్తున్న ఐకేపీ ఏపీఎం రాంబాబు



ఇల్లెందురూరల్: ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీటీసీలు పూనెం సురేందర్, కృష్ణప్రసాద్